# ఆసరా



డా॥ జి.వి.కృష్ణయ్య

"ధుమ్ బజాలే దూమ్మ జాలే" పాటకు ఆ ప్రదేశమంతా ప్రతిధ్వనిస్తుంది. పెద్దపెద్ద సౌండ్ బాక్సుల నుండి వస్తున్న ద్వని తరంగ శబ్ద కాలుష్యానికి చెవులు చిల్లులు పడేటట్లున్నాయి. కొందరికి ఆ సంగీతమే సంతోషాన్ని పంచుతుంది. స్టేజిమీద అమ్మాయి వళ్ళు మరిచి డాన్సు చేస్తుంటే చూస్తున్న వాళ్ళ అరుపులు, కేకలు, కేరింతలతో ఎంజాయ్ చేస్తున్నారు.

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కార్పొరేట్ మహిళా రెసిడెన్షియల్ కాలేజి క్యాంపస్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. పేరుకు మాత్రమే ఉపాధ్యాయదినోత్సవం, ప్రధాన భాగస్వామ్యం విద్యార్థులదే. చదువుల వత్తిడి నుండి బయటపడడానికి ఆట విడుపుగా దొరికిన ఆ సమయాన్ని అనుభవించడానికి ప్రతి విద్యార్థి ఆరాటపడుతున్నట్టు అక్కడి సన్నివేశం కనబడుతుంది.

స్టూడెంట్స్ చక్కని వస్త్రధారణతో తలస్నానం చేసిన వెంట్రుకలు రెపరెపలాడుతుంటే మొఖంలో తేజస్సు ప్రస్ఫుటంగా కనబడుతుంది. ఎప్పుడూ ధరించే మోడ్రన్ డ్రస్సులు బోరు కొట్టాయేమో గాని ఎక్కువమంది అమ్మాయిలు సాంప్రదాయాన్ని సజీవంగా చూపే ప్రయత్నం చేస్తున్నారు.

ఆ వేదిక భిన్న సంస్కృతుల సమ్మేళనంగా వుంది. కొందరు విద్యార్థినుల తల్లిదండ్రులు కూడా హాజరయ్యారు. విద్యార్థుల ఆనందంలో వారూ పాలు పంచుకుంటున్నారు. విశాలమైన కాలేజి భవన సముదాయాల మధ్య ఏర్పాటు చేసిన వేదిక స్థలం చిన్నది కావడంతో విద్యార్థులతో కిక్కిరిసిపోయింది.

అదే కాలేజిలో చదువుతున్న మా మిత్రుడు ఆనంద్ కూతురు సింధూజ కోసం ఆ జనసమూహంలో చాలా సేపట్నుంచి వెదుకుతున్నాం. దూరం నుంచి చూసి పరిగెత్తుకుంటూ వచ్చి నాన్నను వాటేసుకుంది. ఆనందంతో గంతేసింది. ఆరోజు కల్చరర్ ప్రోగ్రాం గురించి గుక్క తిప్పుకోకుండా చెబుతుంది. తన ప్రోగ్రాం నాన్న చూడకుండానే అయిపోయినందుకు బాధపడుతుంది.

"విజిటర్స్ టైం అయిపోతుందని మీ నాన్న కారు చాలా స్పీడుగా డ్రైవ్ చేశాడు. ట్రాఫిక్ వల్ల లేటయ్యింది. మొత్తం మీద సమయానికొచ్చినట్లున్నాం." అన్నాను దీర్ఘంగా శ్వాస పీలుస్తూ.

"ఫంక్షన్స్ జరిగేప్పుడు అలా వుండదు అంకుల్"

"ఫంక్షన్ సంగతి మీకు తెలీదు గదా ! అనుకోకుండా వస్తిమి. అక్కయ్య చదివేటప్పుడు ఒకసారి విజిటర్స్ టైం అయిపోయాక వస్తే లోపలికి రానివ్వలేదు. గేటు దగ్గర ఎదురు చూసి చూసి ఏడుస్తూ పోయిందట. నేను మరలా డిన్నర్ టైం వరకు వెయిట్ చేసి మాట్లాడిపోవల్సి వచ్చింది. ఆరోజు చానా ఇబ్బందిపడ్డాను." పాత అనుభవాన్ని నెమరేసుకున్నాడు ఆనంద్.

"అవును.... విజిటర్స్ టైం దాటాక ఎవర్ని రానివ్వరు. స్టూడెంట్స్‌ని చేర్చుకునే సమయంలోనే ఈ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ చెబుతారు. వాటికి ఇష్టపడితేనే కాలేజిలో జాయిన్ చేసుకుంటారు" అంది సింధూజ.

"కార్పొరేట్ కాలేజీల హవా అలా వుంది. రూల్స్ చాలా స్ట్రిక్ట్‌గా వుంటాయన్నమాట" యధాలాపంగా అన్నాను.

"రూల్సా.... వీళ్ళ పాడా ! అదొక 'షో' అంతే. క్రమశిక్షణ పేరుతో వ్యాపారం. రాబడి పెరగాలంటే కృత్రిమ కొరత సృష్టించి డిమాండ్ పెంచడం వ్యాపార లక్షణం. టైంసెన్స్ కాలేజి అడ్మిషన్లప్పుడు వుండదు. స్టాఫ్ చేత ఓవర్‌టైం పని చేయించుకునేప్పుడు గుర్తుకురాదు. లాభం వస్తుందనుకుంటే కాలం కాస్త అటూ ఇటయినా పర్వాలేదు". వ్యంగ్యంగా అన్నాడు మాతో పాటు అక్కడున్న నరసింహం.

అలా మాట్లాడుకుంటూ కాలేజి మెయిన్ బిల్డింగ్ ముందుకొచ్చాం. అక్కడ నిలబడి చూస్తుంటే నిలువెత్తు భవనాలు మా చుట్టూ చేరి అమాంతం

మ్రింగేసేటట్లున్నాయి. మధ్యలో వాటర్ ఫౌంటెయిన్ విద్యుత్ కాంతిలో రంగుల హోళీ ఆడుతున్నట్లుంది. పచ్చికమధ్యలో పెరిగిన పూలమొక్కలు,క్రోటన్‌జాతులు ఉద్యానవనాన్ని మరిపిస్తున్నాయి. ప్రశాంత మైన గాలి హాయిగా పలకరిస్తుంది. చదువరులకు కావల్సిన ఆహ్లాదకరమైన వాతావరణం కనువిందు చేస్తుంది.

ఆనంద్ కూతురి కోసం వాళ్ళమ్మ పంపిన జున్ను డబ్బా కారులోంచి తీసిచ్చాడు. అది చూడగానే సింధూజ కళ్ళల్లో చెప్పలేని ఆనందం కనపడింది. వెంటనే బాక్స్ తెరిచి మాకూ పెట్టి రుచి చూసి దాసుకుంది.

తన బ్యాచ్‌లో మరో ఇద్దరమ్మాయిలకు తనకంటే కాస్త మార్కులు ఎక్కువొస్తున్నాయట. ఈసారి క్లాస్ టెస్ట్‌లో ఎట్లయినా సరే వాళ్ళను దాటి పోవాలం టుంది. ఆ మాటలంటున్నప్పుడు ఒకింత అసహనం, ఈర్ష్య, తట్టుకోలేకపోవడం, తనకు దక్కాల్సిన దాన్ని ఎవరో తన్నుకుపోతున్నారన్న కసి ఆమె ముఖంలో కనబడుతున్నాయి.

సింధూజ నాన్న ఏదో సర్దిచెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని ఆమె మామూలు స్థితికి రాలేకపోతుంది. “ఎలాగయినా సరే” అవతలి వాళ్ళని అధిగమించాలనే పోటీతత్వం ఆరోగ్యకరమైన వాతావరణంలో లేదనిపించింది.

చాలా సేపట్నించి ఒక విద్యార్థిని లోపలికి బయటకు తిరగడం గమనించాను. ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లుంది. ఆందోళనగా తిరుగుతుంది.

మేము ఆమె పరిస్థితి గమనించడం చూసి మా దగ్గరకొచ్చి నిలబడింది. చేతులు నలుపుకుంటూ, అటూ ఇటూ చూస్తూ ఏదో అడగాలని ప్రయత్నిస్తుంది.

“ఏంటమ్మా !” నేనే చొరవచేసి అడిగాను.

“మీ దగ్గర సెల్‌ఫోన్ వుందా అంకుల్”.

“ఆ... వుంది !”

“మా ప్యారెంట్స్ వస్తామన్నారు.... ఇంకా రాలేదు. ఒక్కఫోన్ చేస్తాను... ప్లీజ్ అంకుల్.” చాలా మర్యాదగా అడిగింది.

“అలాగే ఇదిగో” సెల్‌ఫోన్ ఇచ్చాను.

రెండుచేతి వేళ్ళ మధ్య సెల్‌ఫోన్ పెట్టుకుని రెండు బొటన వేళ్ళతో టకటకా నంబర్స్ డయల్ చేసింది. ఆ సెల్ ఆపరేట్ చేసే విధానమే ఇప్పటి యువత స్పీడ్‌ని తెలుపుతుంది.

అవతలి వ్యక్తి ఫోన్ తీయగానే కొంచెం దూరంగా జరిగి మాట్లాడుతుంది.

బంగారు వన్నెలో, సన్నగా, గాగ్రాచోలి డ్రస్ ధరించి హెడ్‌పిన్ పెట్టిన వెంట్రుకలు గాలికి ఎగురు తుంటే కళ్ళు నలుపుకుంటూ ఫోన్ మాట్లాడుతుంది.

“మీరు అలా ఫోన్ ఇవ్వకండి అంకుల్ మా కాలేజి స్టాఫ్‌గానివార్డెన్ గాని చూసారంటే ఐదొందలు ఫైన్ వేస్తారు. మీరు వెళ్ళాక నా దగ్గర కలెక్ట్ చేస్తారు. ఇక్కడ స్టూడెంట్స్ దగ్గర ఫోన్ ఉండకూడదు”. సింధూజ ఆ అమ్మాయి వైపు చూస్తూ మాతో మాట్లాడు తుంది.

“అదేంటి, పాపం పేరెంట్స్ రాలేదట గదా! ఇందాకట్నుంచి ఎదురు చూస్తుంది.” అన్నాను.

“అయ్యో మీకు తెలీదు అంకుల్ పేరెంట్స్ కనిచెప్పి బాయ్‌ఫ్రెండ్స్‌కి ఫోన్ చేస్తుంటారు” సింధూజ విసుగ్గా అంది.

“ఆమెని చూస్తే అలా అనిపించడం లేదులే”

మా మాటలు వినిందో ఏమో కన్నీళ్ళు తుడుచుకుంటూ వచ్చి “థ్యాంక్స్ అంకుల్” ఫోన్ ఇచ్చి చరచరా లోపలికెళ్ళింది.

ఆమె ఫోన్ మాట్లాడుతుంటే ఒక్క ముక్క కూడా అవతలి వారికి వినిపించడం లేదు. చాలా మృదువుగా, సన్నగా మాట్లాడుతుంది. ఆమె కన్నీటికి భావోద్వేగానికి కారణం ఏమై ఉంటుందో !

ఎంతో హుషారుగా, ధైర్యంగా ఉన్నట్లు కనిపించే యువతలో ఈ సెన్సిటివిటీ ఏమిటో అర్థం కాదు. అపజయాన్ని భరించలేరు, నిర్ణయాల్లో స్థిరత్వం ఉండదు, చిన్న విషయాలకు కూడా ఆత్మవిశ్వాసం కోల్పోతుంటారు !

కుటుంబం, సమాజం, విద్యావ్యవస్థల నిర్లక్ష్యమే దీనికి కారణమేమో? ఆ వయస్సులో శారీరకంగానే కాక హార్మోన్ల మార్పువల్ల భయం, ఉద్వేగం, ఆసక్తి ఉంటుంది. వారి మనస్సుల్లో కొత్త ఊహలు పుట్టి సాహసాలు చేయాలనే తపన మొలకెత్తుతుంది. తాము కొత్తగా వేసే అడుగు సరైనదో కాదో అర్థం కాక సందేహాలు తీర్చే ఆసరా దొరకక... ఎవరితో పంచుకోవాలో తెలియక కొత్త థ్రిల్‌ని వదులుకోలేని బలహీనత వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తుంది. అవి దొరకనప్పుడు వ్యసనాలకు బానిసవుతాడు. అందుకే ఎప్పటికప్పుడు మీకు “నేనున్నానంటూ” భరోసా, భద్రత ఇచ్చే తోడు కావాలి. అది తల్లిదండ్రులు కావచ్చు, స్నేహం కావచ్చు, సమాజం కావచ్చు, విద్యాలయం కావచ్చు. నా ఆలోచనలు అనేక కోణాల్లోకి పోతున్నాయి.

మా ప్రక్కన ఒక ఆటో వచ్చి ఆగింది. ఇద్దరు మధ్య వయస్కులు ఒక ఆడా మగా అందులోంచి దిగారు. మగమనిషి ఆటోలోంచి ముందుగా దిగి చేతిలో చుట్ట కింద పడేసి కాలితో నడుపుతూ ఆటో అతనికి డబ్బులిస్తున్నాడు. వారి ఆహార్యం చూస్తుంటే గ్రామీణ రైతుల్లా వున్నారు.

ఇంతకు ముందు ఫోన్ చేసిన అమ్మాయి పరుగున వచ్చి వారిముందు వాలింది. ఆమె ముఖంలో వేయి దీపాల కాంతి వచ్చింది. బహుశా వారికోసమే ఎదురుచూస్తుందేమో !

## బ్రతుకుబాట

నగరాలన్నీ పెరిగిపోయాయి
ధన దాహంతోను
సిరి సంపదలిచ్చే
పల్లెలన్నీ చిన్నబోయాయి
భూమిని నమ్ముకున్నవాడు
ఆశతో ఆకాశంలోకి
చూస్తున్నాడు
శూన్యంగా నిట్టూర్పులు
విడుస్తోంది ప్రకృతి
బడుగు రైతు బ్రతుకు
బండలైపోతోంది
చదువుకొన్న విద్యార్థి
ఉద్యోగం వేటలో
అలసిపోయి
పట్టెడన్నం కన్న తల్లికి
పెట్టలేక
ఉన్నదంతా చదువు
కొనడానికి ఆవిరి
అయిపోయింది
ప్రభుత్వాలు మారినా
ప్రజా సమస్యలూ
నిరుద్యోగి బ్రతుకూ
మారటం లేదు
ఓటు వేసిన ఓటు మనిషి
దిన దినగండం దిగులుతో
ధరల అధరాలు అందుకోలేక
కృంగి కృశించి పోతున్నాడు.
బడుగు రైతు బ్రతుకు
అస్తవ్యస్తం అయింది
ఈ చీకట్లు అన్నీ తొలగి
వెలుగుపూలు
పూసేది ఎప్పుడో మరి

- పోలాప్రగడ రాజ్యలక్ష్మి

"ఎంతసేపట్నించి చూస్తున్నానో తెలుసా !"

"బస్సు లేటయిందమ్మా" తల్లి నచ్చ చెబుతుంది.

"సరే రండి, ఫంక్షన్ దగ్గరకెళదాం" అమ్మ చేతిలో సంచి తీసుకుంటూ అంది.

"వద్దులేమ్మా ! చీకటి పడుతుంది ఆలస్యమైతే మన ఊరు లాస్ట్ బస్ కూడా పోతుంది. అది పోతే తెల్లారిందాకా బస్టాండులో జాగారం చెయ్యాలి. బాగా చదువుకుంటున్నారా ! రా కుర్చో" తండ్రి వరండాలో కూర్చున్నారు.

కూతురు కోసం తెచ్చిన సజ్జ బూరెలు, పప్పుచెక్కలు, రవ్వలడ్డూ ఉన్న క్యరలసంచి తెరిచి టిఫిన్ బాక్స్‌లోని రవ్వలడ్డు తీసి కూతురు చేతిలో పెట్టింది. "అన్నం సరిగా ఉంటుందా ?" "ఆరోగ్యం బావుందా ?" వారంరోజుల్లో నాన్న మళ్ళా వస్తాడ్లే దిగులు పెట్టుకోమాక" అంది తల్లి.

చదువుకంటే ఆరోగ్యమే ముఖ్యమన్నట్లు న్నాయి ఆమె మాటలు. ఆనంద్ సింధూజల సంభా షణలకి పూర్తి భిన్నంగా ఉన్నాయి వీరి మాటలు.

"పొద్దు పోయింది బయలుదేరుతా" మంటూ తండ్రి పైకి లేచి పంచెకింద డ్రాయర్‌లోంచి ఒక పొట్లం తీసి కూతురు చేతికిచ్చాడు.

అందులో ఏముందో ఆమెకు తెలుసు. "ఎంత?" అంది.

"ఆరు వేలు". బాకీదారుడిలా తండ్రి సమాధానం.

"పది వేలు కట్టాల్సుంటే ఆరువేలు తెచ్చా రేంటి".

రుసరుసలాడుతూ ముఖం నల్లగా పెట్టుకుని బాధపడుతుంది.

"డబ్బులు రావల్సినకాడ సమయానికి అంద లేదు. నువు బాధపడతావని మీ అమ్మ నానుతాడు కుదవ పెట్టి ఈ డబ్బులు తెచ్చాం. ఒక వారంలో పొగాకు డబ్బులు వస్తాయి. పూర్తిగా కట్టేద్దాంలే !" తండ్రి సముదాయించాడు.

అమ్మ ముఖంలోకి చూసింది. బంగారు గొలుసు బదులు మెడలో పసుపుతాడు కనబడింది. ఏమీ మాట్లాడలేక కళ్ళు తుడుసుకుంది.

కాలేజీ క్యాంపస్ ఒక్కసారిగా గొల్లున లేచింది. విద్యార్థినులు అటూ ఇటూ పరిగెడు తున్నారు. మూడవ అంతస్తులో గుంపుగా కనబడు తున్నారు.

"ఏమయ్యిందే ! అలా పరుగెడు తున్నారు" సింధూజ తన క్లాస్‌మేట్‌ని ఆపి అడిగింది.

"సీనియర్ ఇంటర్ అమ్మాయి 'కుసుమ' రూములో ఉరేసుకుందట, చనిపోయిందంటున్నారు". చెప్పేసి గబగబా అటువైపు వెళ్ళిపోయింది. మేము నిశ్చేష్టులమై చూస్తున్నాం.

"ఎందుకు ఉరేసుకుంది ?"

కారణం తెలియకుండానే ఊహా గానాలు ఊపందుకున్నాయి. అప్పటికే కుసుమ బాడీని క్రిందకు దించుతున్నారు. మరికొద్ది సేపట్లో అంబులెన్స్ వచ్చి బాడీనితీసుకుపోయింది.కోలాహలంగా ఉన్న క్యాంపస్ వాతావరణం క్షణాల్లో ఉద్వేగంతో నిండిపోయింది.

టెన్షన్ తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. మాకు మతిపోయినంత పనైంది.

"చదువుకునే అమ్మాయికి ఆత్మహత్య చేసుకునేంత టెన్షన్ ఏంటి? ఇంకేదన్నా కారణముం టుంది" అన్నాడు ఆనంద్.

"ఆ అమ్మాయి చాలా తెలివైంది నాన్నా ! టెన్త్‌లో స్టేట్ ర్యాంకు వచ్చిందని ఫ్రీ సీటిచ్చి చేర్చు కున్నారు. ఇంటర్‌లో కూడా స్టేట్‌ర్యాంక్ రావాలని ఆ అమ్మాయికి ప్రత్యేకంగా క్లాసులు తీసుకుని చదివిస్తుంటారు. ఎవ్వరితో కలవనివ్వరు, మాట్లాడ నివ్వారు. ఎప్పుడూ చదివించడం, టెస్ట్‌లు పెట్టడం, మొన్న టెస్ట్ పెడితే మార్కులు తగ్గాయని కాలేజి వాళ్ళు తిట్టారట. అప్పట్నించి అదోలా ఉంది. ఆ అవమానం, వత్తిడి తట్టుకోలేక ఈరోజు అందరూ ఫంక్షన్ దగ్గరుండడం చూచి ఉరేసుకున్నట్లుంది. పాపం చాలా మంచిది నాన్నా "సింధూజ ముఖం దుఃఖంతో కళావిహీనమై పోయింది.

నాకు కాలేజి యాజమాన్యం మీద "హత్యా నేరం" మోపాలనిపించింది. నిజానికి ఇది "హత్యే" ర్యాంకు వస్తే విద్యార్థి భవిష్యత్ సంగతేమో కాని ఆ ర్యాంకు పేరు చెప్పుకుని యాజమాన్యం కోట్లు సంపా యిస్తుంది. ఒకరికి పెట్టుబడి పెట్టి వెయ్యి మంది దగ్గర డబ్బు గుంజేస్తుంది. వీరి లాభాలవేటకు ఒక విద్యార్థి అన్యాయంగా బలైంది. నా కోపం కట్టలు తెంచుకుంది. "ఇంత వత్తిడి మధ్య పెరిగి చివరికి ఏమవుతారు" అన్నాను బాధగా.

"ఏముంది మెంటల్‌గా తయారై మేథావు లుగా బయటకొస్తారు. ఏ అనుబంధం లేని మెటీరియల్ లైఫ్‌లో నిస్తేజంగా, నిర్వికారంగా జీవితమంటే ఏమిటో తెలియకుండానే బతికేస్తుం టారు. అనుభ వాలు నేర్పే గుణపాఠాలుండవు. జీవితంపట్ల అవగాహన ఉండదు. అంతా యాంత్రిక జీవనమే" నిరాశగా అన్నాడు నరసింహం.

"భవిష్యత్ ఒక భయంకరమైన సమాజాన్ని చూడబోతుంది" అన్నాను. "ఖచ్చితంగా దానికి కారకులెవరన్నది ప్రతి ఒక్కరం ప్రశ్నించుకోవాలి. బిడ్డ పుట్టింది మొదలు సంపాదన పరుడవ్వాలని కోరుకుంటున్నామే గాని సంస్కారవంతుడవ్వాలని ఆశించడం లేదు. మన పెంపకంలో స్వార్థం ఉంది. కాబట్టి వాళ్లు స్వార్థ పరులుగా తయారవుతున్నారు. వయస్సు మళ్లిన వాళ్ళను వృద్ధాశ్రమాలకు తరిమేస్తున్నారు. మానసిక అశాంతికి సామాజిక అలజడికి ఇదే కారణం. విద్యావ్యవస్థే మూలం" నరసింహం ఆవేశంగా మాట్లాడుతున్నా అందులో వాస్తవాలు ఉన్నాయి.

ఆనంద్ ముఖంలో ఆనందం మసకబారు తుంది. పల్లెటూరి దంపతులు కూతుర్ని ఒడిలోకి తీసుకున్నారు. పిల్లలకు వీడ్కోలు చెప్పి రావాలంటే అడుగులు పడడం లేదు. నిశ్శబ్దం కూడా భయపెడు తుంది. ఈ సాలెగూడులో అందరం బందీలమే. పరిష్కారం కోసం ప్రతి మనసు ఆరాటపడుతుంది. ఈరోజు కాకున్నా ఏదో ఒకరోజు పరిష్కారం లభిస్తుందన్న ఆశ మా అందరిలో కలిగింది. బరువైన హృదయాలతో క్యాంపస్ బయటకొచ్చాం. మా ఆలోచనల చుట్టూ 'కుసుమే' కేంద్రబిందువుగా కనబడుతుంది. ప్రస్తుత విద్యా విధానం బ్రద్దలు కావాలి. అవును బ్రద్ధలు కావాలి. అందరిది అదే మాట.

## ద్వా.నా.శాస్త్రి ఆత్మీయ పురస్కారాలు

**తెలుగు భాషా సాహిత్యాలకి విశిష్ట కృషి చేస్తున్న ముగ్గురికి**
**జూన్ 16వ రవీంద్రభారతిలో జరిగే ద్వా.నా.శాస్త్రి షష్టిపూర్తి సభలో**
**ఈ ఆత్మీయ పురస్కారాలు ఇవ్వడానికి షష్టిపూర్తి సారధ్య సంఘం తీర్మానించింది.**

**పురస్కార గ్రహీతలు :**

1. డా॥ జి.వి.పూర్ణచంద్
   తెలుగు భాషా పరిశోధకుడు, కవి, రచయిత
2. డా॥ నలిమెల భాస్కర్
   బహుభాషావేత్త, కవి.
3. ఏలూరి రఘు
   ఈ టి.వి.2 తెలుగు వెలుగు శీర్షిక నిర్వహణ